క్లుప్తంగా

17న రాజంపేటలో కల్వారి మహోత్సవం


పి.సతీష్

రాజంపేట టౌన్ : ఈనెల 17వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి తిరుపతి రోడ్డులో సబ్‌స్టేషన్ పక్కన ఉన్న ఎస్ఆర్ కల్యాణ మండపంలో కల్వారి మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహోత్సవంలో హైదరాబాద్‌కు చెందిన కల్వారి టెంపుల్ వ్యవస్థాపకులు, దైవజనులు పి.సతీష్ ప్రభువు సందేశాన్ని తెలియజేస్తారన్నారు. అలాగే సమాజంలో జనులంతా సుఖ సంతోషాలతో జీవించాలని, శాంతి నెలకొనాలని ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నట్లు చెప్పారు. మహోత్సవంలో క్రైస్తవులు, విశ్వాసులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

వీల్ చైర్ వితరణ


వీల్‌చైర్ అందజేస్తున్న క్లబ్ సభ్యులు

రాయచోటి టౌన్ : దీర్ఘకాలికంగా అనారోగ్యంతో బాధపడుతున్న రెడ్డికుమార్ అనే యువకుడికి లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి అధ్యక్షులు పసుపులేటి శ్యామ్ ఆధ్వర్యంలో అందజేశారు. శనివారం రాయచోటి ఎస్ఎన్ కాలనీలో నివాసం ఉండే రెడ్డికుమార్ బాల్యం నుంచి దీర్ఘకాలికంగా బాధపడుతూ నడవలేని స్థితిలో ఉన్నాడు. ఈ విషయం రాయచోటి ఆఫ్ లయన్స్ క్లబ్ వారికి తెలియచేయడంతో అధ్యక్షులు జబీవుల్లా అనే దాత దాతృత్వంతో కొనుగోలు చేసి వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు వీరికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో రీజనల్ చైర్మన్ లయన్ షేక్ మహమ్మద్, మాజీ అధ్యక్షులు పి.శివారెడ్డి, షంషీర్ వలీ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే అరవ శ్రీధర్ శనివారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని కటికంవారిపల్లి గ్రామంలో తులసమ్మకు రూ. 58 వేలు, ఓబులవారిపల్లి నూకా మురళీమోహన్ రెడ్డికి రూ. 28,500లు, నిఖితకు రూ.69 వేలు, సయ్యద్ అష్రఫ్ అలీకి రూ.52 వేలు విలువ చేసే చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకురాలు ముక్కా వరలక్ష్మి, పున్నాటి వాసుదేవరెడ్డి, షేక్ మస్తాన్ అలీ, సయ్యద్ జమీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్ మహిళలకు అస్త్రం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

రాయచోటి టౌన్ : మహిళలకు శక్తి యాప్ ఒక అస్త్రంలా మారుతుందని పోలీస్ అధికారులు తెలిపారు. శనివారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రాయచోటి డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో విద్యార్థులకు శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ యాప్ ద్వారా ప్రతి మహిళ, బాలిక, విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా మారుతుందని దీనిని మహిళలు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ యాప్ తక్షణ అస్త్రంగా ఎలా పని చేస్తుందనే విషయాన్ని వివరించారు. 112 ద్వారా ఫిర్యాదు చేసిన వెంటనే కేవలం 10 నిమిషాలలో ఆయా ప్రదేశానికి పోలీస్ అధికారులు చేరుకొని రక్షణ కల్పిస్తారని చెప్పారు.

వాలంటీర్ల వ్యవస్థను పునరుద్ధరించాలి

వీరబల్లి : కూటమి ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట ఇచ్చిన ప్రకారం తిరిగి వాలంటీర్ల వ్యవస్థను పునరుద్ధరించాలని అన్నమయ్య జిల్లా వాలంటీర్ల సంఘం అధ్యక్షులు చెన్నూరు వెంకట్రామ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో ఎన్నికల ప్రచారంలో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాలంటరీల వ్యవస్థను కొనసాగిస్తూ ఒక్కొక్కరికి రూ. 10 వేలు జీతం చేస్తామని చెప్పారన్నారు. ఆ మాటలు నమ్మి తాము చంద్రబాబు నాయుడుకు ఓట్లు వేసి గెలిపించినట్టు తెలియజేశారు. కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పూర్తిగా వాలంటరీ వ్యవస్థనే లేకుండా చేశారని, ఆయన మాటలు నమ్ముకున్న యువతీయువకులు నేడు రోడ్లు మీద తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వాలంటీర్ల వ్యవస్థను పునరుద్ధరించాలని వెంకట్రామ్ కోరారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మంచి ఆలోచనతో ప్రవేశపెట్టిన వాలంటరీ వ్యవస్థను పూర్తిగా రద్దు చేయడం సరికాదని, ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాలని విన్నవించారు.

కృపయా.. స్టాప్ కీజియే!

- ఓబులవారిపల్లెలో ఆగని రైళ్లు
- జంక్షన్‌గా మారిన ప్రయోజనం శూన్యం
- అధికారుల నిర్లక్ష్యంతో పేరు కూడా మారని వైనం
- కూటమి నాయకులు ట్రైన్‌ల స్టాపింగ్‌కు చొరవ చూపాలంటున్న ప్రయాణికులు



జంక్షన్ పేరుకు కూడా నోచుకోని ఓబులవారిపల్లె రైల్వే స్టేషన్

ఓబులవారిపల్లె : రైల్వేశాఖ అధికారులు ఓబులవారిపల్లి రైల్వేస్టేషన్‌ను పేరుకే జంక్షన్‌గా మార్చారు. జంక్షన్ అయితే ఈ ప్రాంత రైల్వే పరంగా అభివృద్ధి చెందుతున్న ప్రజల ఆశలు అడియాశలుగా మారాయి. కృష్ణపట్నం ఓడరేవుకు ఓబులవారిపల్లి నుంచి రాపూరు మీదుగా ప్రత్యేక రైల్వేలైన్‌ను ఆశాఖ ఏర్పాటు చేసింది. అయితే ఆ మార్గంలో రైలును నడపడంలో, మిగత రైళ్ల హాల్ట్ విషయంలో రైల్వే శాఖ వివక్ష చూపడంతో పూర్తిగా వెనుకబడిపోయింది.

జంక్షన్ కాకముందు ఎక్స్‌ప్రెస్ రైలు నిలబడేవి..

బ్రిటిష్ కాలంలో మద్రాసు నుంచి రెడ్డిపల్లి వరకు ఆంగ్లేయులు రైల్వేలైను ఏర్పాటు చేశారు. ఇక్కడ శేషాచల అడవుల్లో భారీగా కలప నిక్షేపాలు ఉండటంతో రైల్వే పట్టాలు ఏర్పాటుకు ఇక్కడి నుండే మద్రాసుకు కలపను భారీ స్థాయిలో సరఫరా చేస్తుండేవారు. కోవిడ్‌కు ముందు దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం నుంచి ఓబులవారిపల్లి రైల్వేస్టేషన్‌లో తొలుత జనతా ఎక్స్‌ప్రెస్, రాయలసీమ ఎక్స్‌ప్రెస్ నిలబడుతూ ఉండేవి. కోవిడ్ కారణంగా ఎక్స్‌ప్రెస్ రైళ్లను రైల్వేశాఖ అధికారులు పూర్తిగా రద్దు చేశారు. ఓబులవారిపల్లి జంక్షన్ అయితే మరిన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలబడతాయని ప్రయాణికులు, మండల ప్రజలు భావించారు. కొత్తరైలు మాట దేవుడెరుగు ఉన్న రైళ్లను కూడా పూర్తిగా తొలగించి ప్రజల ఆశలపై నీళ్లు చల్లారు.

రైల్వేశాఖ అధికారుల వివక్ష..

ఓబులవారిపల్లి రైల్వేస్టేషన్ జంక్షన్ అయినా కూడా కనీసం బోర్డులో కూడా జంక్షన్ అన్న పేరు మార్చడానికి కూడా రైల్వేశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కోవిడ్ అనంతరం ప్రస్తుతం దేశ వ్యాప్తంగా స్టాపింగ్ ఎత్తివేసిన రైల్వేశాఖ స్టాపింగ్ కలిపిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఓబులవారిపల్లి రైల్వేస్టేషన్‌లో కేవలం హరిప్రియ ఎక్స్‌ప్రెస్‌కు మాత్రమే స్టాపింగ్ కల్పించి జంక్షన్‌పై అధికారులు వివక్ష చూపిస్తున్నారు.

ప్రజలకు తప్పని అగచాట్లు

సుదూర ప్రాంతాలకు వెళ్లాలంటే అటు ఇరవై కిలోమీటర్లు రాజంపేటకు వెళ్లాలి. లేదంటే 19 కిలోమీటర్లు రైల్వేకోడూరుకు వెళ్లాల్సి వస్తుంది. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ముగ్గురాయి ఖనిజం మంగంపేటలో ఉంది. అధికారులు, వ్యాపారులు పట్టణాలలో చదువుతున్న విద్యార్థులు, ప్రజలు ప్రతిరోజూ అగచాట్లు పడుతున్నారు. ఇప్పటికైనా రైల్వేశాఖ అధికారులు చొరవచూపి మండల కేంద్రంలో గతంలో స్టాపింగ్ ఉన్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్, వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌లకు వెంటనే స్టాపింగ్ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

కూటమి నాయకుల నిర్లక్ష్యం

కోవిడ్ అనంతరం దాదాపు నాలుగు సంవత్సరాలు అయినప్పటికీ మండల కేంద్రంలో పూర్తి స్థాయిలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ లేదు. పలుమార్లు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి రైల్వేశాఖ మంత్రిని ఢిల్లీలో కలిసి సమస్యలు పరిష్కరించాలని అభ్యర్థించారు. కానీ బీజేపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. స్థానిక ప్రజాప్రతినిధులు పూర్తిగా నిర్లక్ష్యం వహించడంతో ఓబులవారిపల్లిలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ కల్పించలేదని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ప్రస్తుతం ఇటు రాష్ట్రంలో అటు కేంద్రంలో కూటమి ప్రభుత్వమే ఉన్న నియోజకవర్గ ఎమ్మెల్యే కూటమి నుంచే ఉన్నా రైల్వే సమస్యలను పై స్థాయికి చేర్చడంలో విఫలమయ్యాడన్న చర్చ మండలంలో పెద్దఎత్తున వినిపిస్తోంది. ఇప్పటికైనా కూటమి పార్టీల మండల, నియోజకవర్గ నాయకులు ఓబులవారిపల్లె జంక్షన్‌కు జరుగుతున్న దగాను అధికారులు, రైల్వే మంత్రుల దృష్టికి తీసుకెళ్లి రైళ్లను ఆపే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజానీకం కోరుకుంటోంది.

రాయలసీమ, వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ కల్పించాలి



కోవిడ్‌కు ముందు స్టాపింగ్ ఎత్తివేసిన స్టేషన్‌లలో రైల్వేశాఖ అధికారులు ఇటీవలే స్టాపింగ్ కల్పించారు. అలాగే ఓబులవారిపల్లిలో గతంలో నిలబడుతున్న రాయలసీమ, వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్ కల్పించాలి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు పలు రైళ్లను స్టాపింగ్ అయ్యేలా చర్యలు చేపట్టాలి.

\- షేక్ మస్తాన్ అలీ, వ్యాపారి, ఓబులవారిపల్లి

జంక్షన్‌లో ఒక రైలు మాత్రమే..



ఇప్పటికే రాయలసీమ, హరిప్రియ ఎక్స్‌ప్రెస్‌లకు ఓబులవారిపల్లి జంక్షన్‌లో నాలుగుసార్లు స్టాపింగ్ తొలగిస్తూ, కల్పిస్తూ వచ్చారు. ఇప్పుడు హరిప్రియకు మాత్రమే స్టాపింగ్ కల్పించారు. రైల్వే అధికారులు ఈ విధంగా ప్రవర్తించడం ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఓబులవారిలపల్లెలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేలా చొరవ చూపాలి.

\- ఎన్‌పీ వెంకట సుబ్బారెడ్డి, రైతు, ఓబులవారిపల్లె

వేంకటేశ్వర స్వామికి పూజలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

సుండుపల్లి : మండల పరిధిలోని ముడుంపాడు గ్రామం ఆరోగ్యపురం ఎం.జె.ఆర్ కాలనీలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకం చేసి, పూలతో అలంకరించారు. అనంతరం నైవేద్యం సమర్పించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. వచ్చిన భక్తులు స్వామివారిని, ఆంజనేయ స్వామిని దర్శించుకుని ఆశీర్వాదాలు పొందారు.

నేడు సీతారాముల కల్యాణం

రాజంపేట టౌన్ : మండలంలోని అత్తిరాల కడియాలపల్లెలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. గ్రామంలో రామాలయాన్ని నూతనంగా నిర్మించి 41 రోజులు పూర్తయిన సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వేకువ జాము నుంచే ఆలయ ప్రధాన అర్చకులు విజయ్ స్వామి నేతృత్వంలో విశేషంగా పూజా కార్యక్రమాలను చేపట్టనున్నారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలియజేశారు. సాయంత్రం కల్యాణ మూర్తులు పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. కాగా సోమవారం వేకువ జామున కడియాలపల్లెలోని రామాలయం నుంచి గ్రామస్తులు, రాములోరి భక్తులు ఒంటిమిట్టకు పాదయాత్ర చేపట్టనున్నారు.

బాబు పాలనలో రాష్ట్రానికి ఒరిగిందేంటి?

- మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయటమేనా అభివృద్ధి
- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుజ్జల ఈశ్వరయ్య


మాట్లాడుతున్న ఈశ్వరయ్య

రాజంపేట రూరల్ : కూటమి ప్రభుత్వ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు పాలనలో రాష్ట్రానికి ఒరిగిందేంటని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుజ్జల ఈశ్వరయ్య ప్రశ్నించారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో శనివారం సీపీఐ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయటమేనా అభివృద్ధి అని ఎద్దేవా చేశారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన 17 మెడికల్ కళాశాలలను నడపలేమని మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఉత్తరాలు రాయటం చాలా దారుణమన్నారు. ప్రభుత్వ రంగం అంటేనే చంద్రబాబుకు నచ్చదన్నారు. గతంలోనూ చంద్రబాబు ప్రైవేటు రంగాన్నే ప్రోత్సహించారని గుర్తు చేశారు. బాబు తన ఆస్తులను పెంచుకోవడానికి ప్రైవేటు రంగాన్ని ఉపాధిగా వాడుకుంటారని ఆరోపించారు. నీటి పారుదల ప్రాజెక్టుల పైన బాబుకు చిత్తశుద్ధి ఎక్కడ ఉంది అని మండిపడ్డారు. యువతకు ఉపాధి అవకాశాలు ఎక్కడ అని ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యుత్ చార్జీలు పెంచమని చిలక పలుకులు పలికిన చంద్రబాబు నేడు విద్యుత్ చార్జీలు అమాంతం ఎందుకు పెంచారని నిలదీశారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టాలని పాదయాత్రలో లోకేష్ సెలవిచ్చి నేడు చేస్తున్నదేమిటన్నారు. రైతులకు యూరియా సరఫరా చేయటంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. ప్రశ్నించే గొంతుకలను పోలీసుల చేత దాడులు చేయించటం హేమమైన చర్య అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మహేష్, పట్టణ కార్యదర్శి ఇ.సికిందర్, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు, నాయకులు రమణ పాల్గొన్నారు.

15 నుంచి గాలికుంటు నివారణ టీకాలు

సుండుపల్లె : పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ చేసినట్లు పశుసంవర్ధక శాఖ ఏడీ విజయకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి డివిజన్‌కు మొత్తం 94,800 వ్యాక్సిన్ వచ్చిందని అందులో సుండుపల్లె మండలానికి 12250 డోసుల టీకాలను అందించనున్నట్లు చెప్పారు. సెప్టెంబర్ 15వ తేదీ నుంచి అక్టోబర్ 15 వరకు ఈ కార్యక్రమం మండలాల వారీగా జరుగుతుందని పేర్కొన్నారు. ఈనెల 15వ తేదీ పింఛా రాయచోటి ఉపసంచాలకులు డాక్టర్ దాసరి మాల కొండయ్య వారిచే ప్రారంభించబడుతుందని తెలియజేశారు. మండలంలోని రైతులందరూ ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఏడీ సూచించారు.

17న భగవాన్ విశ్వకర్మ జయంతి

రాజంపేట టౌన్ : పట్టణంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఈనెల 17వ తేదీ భగవాన్ విశ్వకర్మ జయంతి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, అనంతరం పంచామృతాభిషేకం, అలంకరణ సేవ, స్వామివారికి సహస్రనామ పూజలు, ధ్వజారోహణం, కలశస్థాపన నవగ్రహ హోమాలు, మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు ఉంటాయన్నారు. సాయంత్రం విశ్వకర్మ విగ్రహ గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు.

25 నుంచి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు


కొలువైన వేంకటేశ్వర స్వామి మూలవిరాట్

రాజంపేట టౌన్ : మండలంలోని చుండువారిపల్లెలో వెలసి ప్రసిద్ధిగాంచిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 25వ తేదీ నుంచి మూడు రోజుల పాటు 13వ వార్షిక బ్రహ్మోత్సవాల అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం విలేకరులకు తెలిపారు. 25వ తేదీ సాయంత్రం 5 గంటలకు ప్రముఖ పురోహితులు బ్రహ్మశ్రీ నాగుల దుర్గాప్రసాద్, అవధానం కుమార్ శర్మల ఆధ్వర్యంలో గణపతి పూజతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు. అనంతరం స్వామివారికి స్వస్తిహవాచనం, అంకురార్పణ, ధ్వజారోహణం, అగ్నిప్రతిష్ట కార్యక్రమాలను జరుపనున్నారు. 26వ తేదీ ఉదయం 8 గంటలకు ప్రాతఃకాల పూజలు, దీక్షాహోమం, పంచామృతాభిషేకం, సాయంత్రం ఆరు గంటల నుంచి లలిత సహస్రనామం, విష్ణు సహస్రనామ పారాయణం కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. రాత్రి 9 గంటల నుంచి భక్తిపరమైన సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

27న కల్యాణం

వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని 27వ తేదీ ఉదయం 11 గంటల నుంచి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని కమనీయంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నప్రసాదం కార్యక్రమం ఉంటుందన్నారు. సాయంత్రం కల్యాణ ఉత్సవ మూర్తులను పురవీధుల్లో వైభవోపేతంగా ఊరేగించనున్నారు. కల్యాణ మహోత్సవానికి వేలాది మంది భక్తులు తరలి రానున్నందున భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు తెలిపారు.

భాష పండితుల సమస్యలు పరిష్కరించాలి


ఎన్‌టీఏ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరాజుకు వినతి పత్రాన్ని అందజేస్తున్న భాష పండితులు

రాయచోటి టౌన్ : డీఈఓ పూల్‌లో ఉన్న భాష పండితుల సమస్యలు పరిష్కరించాలని ఎన్‌టీఏ రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం రాయచోటి డైట్ కేంద్రంలో జిల్లా నుంచి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భాష పండితులు ఆయనను కలసి వినతి పత్రాన్ని అందజేశారు. డీఈఓ పూల్‌లో పని చేస్తున్న భాష పండితుల సమస్యలు పరిష్కరించడం లేదని తెలిపారు. భాష పండితులు, పీఈటీ వ్యవస్థ రద్దయి సుమారు ఆరు సంవత్సరాలు అయ్యిందన్నారు. సరిపడా పాఠశాల సహాయకుల పోస్టులు లేని కారణంగా రాష్ట్రంలో చాలా మంది పండిత ఉపాధ్యాయులు డీఈఓ పూల్‌లో పని చేస్తూ పదోన్నతికి నోచుకోక, శాశ్వత స్థానాలు లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. ఈ సమస్యపై కోర్టును ఆశ్రయించగా కోర్టు వారు కూడా తమకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వానికి సూచించిందన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయాలను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేందుకు తన వంతు కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బి.శ్రీనివాస దేవేంద్ర, శ్రీనివాస్, కిరణ్‌కుమార్, తిరుపాల్ నాయక్, మురళి, శృతి, లావణ్య, రోటీ నాయక్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి


భాకరాపేట వద్ద వాహన రికార్డులను తనిఖీ చేస్తున్న సీఐ బాబు

సిద్దవటం : కడప – చెన్నై జాతీయ రహదారి భాకరాపేట తనిఖీ కేంద్రం సమీపాన శనివారం ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ బాబు మాట్లాడుతూ కడప ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాలు కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు సూచన మేరకు కడప – చెన్నై జాతీయ రహదారి భాకరాపేట ఫారెస్టు చెక్ పోస్టు వద్ద వాహనాల తనిఖీలు చేపట్టగా సరైన ధృవీకరణ పత్రాలు లేని పది ద్విచక్ర వాహనదారులకు ఒక్కో ద్విచక్ర వాహనానికి జరిమానా విధించామన్నారు. వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిద్దవటం, ఒంటిమిట్ట పోలీసులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో బాధితులకు సత్వర న్యాయం


రాజంపేట: లోక్ అదాలత్ వివరాలను వెల్లడిస్తున్న జడ్జి ప్రవీణ్‌కుమార్


లక్కిరెడ్డిపల్లి: లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి భరత్ కమల్

రాజంపేట : జాతీయ లోక్ అదాలత్‌లో 1601 కేసులు పరిష్కరించడం జరిగిందని 3వ అదనపు జిల్లా జడ్జి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 3 బెంచ్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రూ.61,79,430 చెల్లించే విధంగా అవార్డులను జారీ చేశామన్నారు. జేఎఫ్‌సీఎం కోర్టులో 1590 క్రిమినల్ కేసులు, రెండు సివిల్ కేసులు పరిష్కరించినట్లు పేర్కొన్నారు. ప్రమాదాలకు సంబంధించిన కేసులను 2వ అదనపు జిల్లా న్యాయమూర్తి కోర్టులో పరిష్కరించామన్నారు. అలానే పీఎల్‌సీ కేసులు, చాల కాలంగా పెండింగ్‌లో ఉన్న కుటుంబసభ్యులు భూ సమస్యలను పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో రాజంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.హనుమంతనాయుడు, ఏపీపీ రామకృష్ణ, ఏజీపీ మౌనిక, న్యాయవాదులు పీఎస్ శ్రీనివాసులు, వీవీరమణ, మౌలానా, భారత్‌రెడ్డి, కాశి, తౌఫిక్, సీనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రాజీనే రాజమార్గం

లక్కిరెడ్డిపల్లి : రాజీనే రాజమార్గమని లక్కిరెడ్డిపల్లి సివిల్ జడ్జి భరత్ కమల్ పేర్కొన్నారు. శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా రూ.8,70,749లు రికవరీ అయినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా సివిల్, క్రిమినల్, భూ తగాదాలు, పాత బకాయిలు సమస్యలు పరిష్కారం అయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎంఎల్ రామచంద్రారెడ్డి, బాలాజీరెడ్డి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

17, 18న మండలస్థాయి క్రీడా పోటీలు


సమావేశంలో పాల్గొన్న అధికారులు, టీచర్లు

నందలూరు : మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న బాల బాలికలకు ఈ నెల 17, 18 తేదీల్లో మండల స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు రాయచోటి డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి నాగయ్య, మండల విద్యాశాఖ అధికారి అనంతకృష్ణ తెలిపారు. శనివారం వారు నాగిరెడ్డిపల్లె జెడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులతో సమావేశమై పోటీలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. 14 ఏళ్లలోపు వారికి రెండు విభాగాలుగా, 17 ఏళ్లలోపు వారికి మరో రెండు విభాగాలుగా చేసి పోటీలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. పోటీలు నాగిరెడ్డిపల్లె జెడ్పీహెచ్ఎస్ మైదానంలో జరుగుతాయని పేర్కొన్నారు. కాగా కబడ్డీ, వాలీబాల్, ఖో ఖో, షటిల్, చెస్, యోగాలలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల కో ఆర్డినేటర్ గౌరీ ప్రకటించారు. సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగనపల్లి వెంకటరమణ, ఎస్‌జీఎఫ్ మండల కో ఆర్డినేటర్ గౌరీ, వ్యాయామ ఉపాధ్యాయులు సుస్మిత, సునీత, కలీముల్లా మగ్దూమ్, జగన్, వెంకట మధులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు రండి


దివ్యజ్ఞానంద స్వామిని ఆహ్వానిస్తున్న గట్టు వీరయ్య

రాజంపేట రూరల్ : వీరచాడేశ్వరీదేవి ఆలయంలో 22 నుంచి నిర్వహించే దసరా ఉత్సవాలకు విచ్చేయవలసిందిగా శ్రీ పుష్పండజ దివ్యజ్ఞానంద స్వామిని ఆలయ ఉప కోశాధికారి గట్టు వీరయ్య కోరారు. బెంగుళూరులోని తొగట వీరక్షత్రియ కుల గురువు దివ్యజ్ఞానంద స్వామిజీ ఆశ్రమానికి శనివారం అలయ అధ్యక్ష, గౌరవ అధ్యక్షులు ఉప్పు రామచంద్ర, పట్టెం శేఖర్‌ల ఆదేశాల మేరకు వీరయ్య వెళ్లి ఆహ్వానించారు.

భూ కబ్జాకు యత్నం ; అడ్డుకున్న దళితులు


కబ్జా చేసేందుకు ప్రయత్నించిన ప్రభుత్వ భూమి


తమకు న్యాయం చేయాలని కోరుతున్న దళితులు

నందలూరు : మండలంలోని ఆడపూరు గ్రామపంచాయతీ పరిధిలోని సర్వేనెంబర్ 571/బిలోని 1.20 ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు కబ్జా చేయడానికి ప్రయత్నించడంతో కొండాయపల్లె దళితులు అడ్డుకున్న సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా దళితులు మాట్లాడుతూ పేదవారమైన తమకు ఆ భూమిలో ఇంటి స్థలాలు మంజూరు చేయాలని తహసీల్దార్, కలెక్టర్‌లను కోరామన్నారు. కానీ శనివారం శ్రీనివాసుల రెడ్డి మరికొందరు వ్యక్తులు ఆ భూమిలో కంచె వేయడానికి ప్రయత్నిస్తుండగా తాము అడ్డుకున్నట్టు తెలయజేశారు. ఈ విషయంపై స్థానిక ఎస్ఐ మల్లికార్జునరెడ్డికి ఫిర్యాదు చేసినట్టు దళితులు చెప్పారు. అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ భూమిని కబ్జా కోరల నుంచి రక్షించి తమకు న్యాయం చేయాలని దళితులు అధికారులకు విన్నవిస్తున్నారు.

దళిత రణభేరిని విజయవంతం చేయండి


దళిత రణభేరి కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీఎస్పీ నాయకులు

సుండుపల్లి : బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ అధ్యక్షతన ఈనెల 24న విజయవాడలో జరిగే దళిత రణభేరి కార్యక్రమానికి దళిత బిడ్డలు తరలిరావాలని అన్నమయ్య జిల్లా ఇన్చార్జ్ వెంకటరమణ, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు యుగంధర్ లు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుండుపల్లి మండలంలోని పెద్ద మాదిగపల్లి, రాయవరం, పింఛా గ్రామాలలో పర్యటించి దళిత రణభేరి గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రస్తుత టీడీపీ పరిపాలనలో దళితులపై జరుగుతున్న దాడులకు నిరసనగా విజయవాడలో దళిత రణభేరి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మతోన్మాద మూకల మధ్య దళితులకు జరుగుతున్న అన్యాయాలు, దాడులను అరికట్టేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో దళితులపై హత్యలు, అత్యాచారులు, దాడులు, దౌర్జన్యాలు, ఆగడం లేదు ఆవేదన వ్యక్తం చేశారు. దళితులపై జరుగుతున్న ఆగడాలను అందరికి తెలియజేయడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని, దళిత మేధావులు, దళితులు పెద్దసంఖ్యలో సభకు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా కార్యదర్శి పెద్దివిటి నరసింహులు, రాయచోటి అసెంబ్లీ అధ్యక్షుడు నాగేశ్వర్, పట్టణ అధ్యక్షుడు మహేష్, ప్రజలు పాల్గొన్నారు.

పాటూరు శీను మరణం వైఎస్సార్‌సీపీకి తీరనిలోటు



రాజంపేట రూరల్ : వైఎస్సార్‌సీపీ పట్టణ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు పాటూరు శ్రీనివాసులురెడ్డి అలియాస్ జీపుల శ్రీను (56) శనివారం గుండెపోటుతో గోవాలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ఆయన మరణం వైఎస్సార్‌సీపీ తీరనిలోటని తెలియజేసి, తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. పాటూరు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి అభిమానిగా రాజంపేట నియోజకవర్గ ప్రజలకు సుపరిచితుడు. ఆకేపాటి అనుచరుడిగా పార్టీకి సేవలందిస్తూ వస్తున్నారు. పార్టీ కార్యక్రమాలు, ప్రచారాలలో ఎప్పుడు ముందు వరుసలో ఉండేవారు. ఎంతో మంది నిరుద్యోగులకు డ్రైవర్‌లగా ఉపాధి కల్పించి అక్కున చేర్చుకున్నాడు. శ్రీనివాసులరెడ్డి మృతదేహాన్ని ఆదివారం రాజంపేట మండలంలోని అచ్చినపల్లికి తీసుకురానున్నారు. సంతాపం ప్రకటించిన వారిలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పాపినేని విశ్వనాథరెడ్డి తదితరులు ఉన్నారు.